క్లుప్తంగా

అండర్-16 క్రికెట్ పోటీల్లో విజేత 'తాడిపత్రి'



విజేతగా నిలిచిన తాడిపత్రి బాలికల జట్టు

తాడిపత్రి అర్బన్: అనంత ప్రీమియర్ లీగ్ అండర్- 16 బాలికల క్రికెట్ పోటీల్లో తాడిపత్రి జట్టు విజేతగా నిలిచింది. శనివారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో ఆత్మకూరు, తాడిపత్రి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆత్మకూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత ఓవర్లలో 53 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తరువాత బ్యాటింగ్ బరిలోకి దిగిన తాడిపత్రి జట్టు 55 పరుగులు సాధించి 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తాడిపత్రి జట్టును ఏటీఎల్ లలిత, సీనియర్ కోచ్ సాధిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు, ఆత్మకూరు జట్టు కోచ్ రఫీ, పీఈటీలు మధు, నరసింహ, ఇంద్రవీణ, వేణు, మల్లికార్జున, ఆర్డీటీ కోచ్ భార్గవ్ అభినందించారు.

ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



విద్యుత్ నిలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రజలపై విధించనున్న విద్యుత్ ట్రూ అప్ (ఇంధన సర్దుబాటు)చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక విద్యుత్ నిలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక మాటతప్పారని విమర్శించారు. రూ.6 వేల కోట్ల ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, చంద్ర, సురేష్, జగ్గిలిరమేష్, సునీల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాలలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జయలక్ష్మీ ఆటో మేటివ్ ప్రైవేట్ లిమిటెడ్, అజిలే ఎయిర్ పోర్టు సర్వీస్, జోయాయికాస్ ఇండియా లిమిటెడ్, లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, శ్రీ రామ్ చిట్స్ తదితర 13 కంపెనీలు ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 8, 9, 10వ తరగతితోపాటు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ, ఏదైనా డిగ్రీ విద్యార్థులు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కల్గి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 8096763970 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐక్యూ కోర్డినేటర్ రాజేష్ కురుపాటి, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ గోపి, బసెట్టి క్రిష్ణయ్య, ఖాజవలి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరామ్

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జయరామ్ అన్నారు. శనివారం కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్నభోజనం వసతి కల్పిస్తానని, కళాశాలకు అంతర్గత రోడ్లు, విద్యార్థుల కోసం బస్‌స్టాప్ ఏర్పాటుకు చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి చెట్టినాథన్ సౌజన్యంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, రూరల్ సీఐ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని చెరువు కట్ట

- శింగనమల చెరువు కట్టపై పెరిగిన కంప చెట్లు
- దెబ్బతిన్న పుంజుకాల్వ తూము
- ఆందోళనలో అన్నదాతలు



శింగనమల చెరువు కట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లు



చెట్లు పెరిగి దెబ్బతిన్న పుంజుకాల్వ తూము

శింగనమల: జిల్లాలోనే అతి పెద్ద చెరువైన శింగనమల చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో నాబార్డు నుంచి నిధులు మంజూరైనా నాసిరకంగా పనులు చేయడంతో, చెరువుకు వేసిన ప్రొటెక్షన్ వాల్ పెచ్చులూడిపోతోంది. చెరువు కట్టపై కంపచెట్లు పెరిగి , కట్ట దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. శింగనమల రంగరాయుల చెరువు దాదాపు 2,600 ఎకరాల విస్తీర్ణంతో ఉంది. చెరువు కట్ట దాదాపు 2.5 కి.మీ పొడవు ఉంది. చెరువు కింద ఆయుకట్టు 2600 ఎకరాలు అధికారికంగా ఉండగా, అనధికారికంగా మరో 3 వేలు ఎకరాలుంది. చెరువు కింద శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, చీలేపల్లి, మట్లగొంది, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయిపేట, పోతురాజుకాల్వ, పెరవలి గ్రామాలకు చెందిన రైతుల ఆయకట్టు భూములున్నాయి. అలాగే చెరువులో నీరు ఉంటే దాదాపు 10 గ్రామాల్లో భూగర్భజలం పెరుగుతుంది. చెరువులో 300 మత్స్యకారుల కుటుంబాలు చేపల పెంపకం వల్ల లబ్ధి పొందుతున్నాయి. గత ఐదు సంవత్సరాల నుంచి చెరువు నీటితో కళకళలాడుతోంది.

చెరువు కట్టకు పెరిగిన కంప చెట్లు

చెరువు కట్ట దాదాపు 2.5 కి.మీ పొడవు ఉంది. ఈ చెరువు కట్టపై విపరీతంగా కంప చెట్లు పెరిగాయి. దీంతో చెరువు కట్ట దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాలకు కంప చెట్లు పెరగడంతో , కట్టపైన నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోకుని కంపచెట్లు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న పింజుకాల్వ తూము

చెరువులో పింజుకాల్వ తూము వద్ద ఏర్పాటు చేసిన బావి కట్టకు రావి చెట్టు పెరిగి పెద్దది కావడంతో కట్టకు ప్రమాదం పొంచిఉంది. చెరువు నిండితే పైనుంచే నీరు బావిలోకి వస్తున్నాయి. ఈ బావిని మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. చెరువు కింద డిసెంబరులో పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. శింగనమల వైపు కొంత మంది రైతులు పంట పెట్టాలని నిర్ణయించుకోగా, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయిపేట, పోతురాజుకాల్వ గ్రామాలకు చెందిన రైతులు పంటలు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే కాల్వల్లో పూడికతీత పెరగడంతో పంటల సాగుకు ఇబ్బందిగా మారింది. ఉపాధి హామీ కింద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్టకు మరమ్మతు చేయించాలి



చెరువు కట్టకు పెరిగిన కంప చెట్లు తొలగించాలి. తూములను మరమ్మతు చేయించాలి. కంప చెట్లు పెరగడం వల్ల చెరువు కట్ట దెబ్బతింతోంది. ఇరిగేషన్ అధికారులు చెరువు కట్టను పరిశీలించి, మరమ్మతు చేయాలి. చెరువుకు ఉన్న నాలుగు తూములను అధికారులు తనిఖీ చేయాలి.

– రాంచరణ్, రైతు శింగనమల

కాలువలో పూడికతీత చేపట్టండి



డిసెంబరులో పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నాం. చెరువులో పంటకు సరిపడే నీరు ఉంది. అందువలన వరి పంట సాగు చేస్తాం. ఆలోపు కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలి. లేకంటే పంటల సాగుకు ఇబ్బందిగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతయ్య, రైతు, శివపురం

ప్రతిపాదనలు పంపాం

శింగనమల చెరువు కట్ట మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. చెరువులో నీరు ఉన్నాయని, జేసీబీతో కంప చెట్లు తొలగింపు చేపట్టలేమని, ఉపాధి హామీ ద్వారా కంప చెట్లు తొలగించాలని డీడబ్ల్యూఎంఏ అధికారులను కోరాం. పనులు మంజూరవగానే కంప చెట్లు తొలగింపు చేపడుతాం.

– రాజుకుమార్, డీఈ, ఇరిగేషన్

జాతీయస్థాయి సదస్సులో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన గేట్స్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: కర్నూలు నగరంలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో జిగ్నాస 2కే 24 పేరుతో నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సులో గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దేశంలోని 50 ఇంజినీరింగ్ కాలేజీలు పాల్గొన్నాయి. సదస్సులో గేట్స్ కాలేజీలో ఈసీఈ, సీఎస్ఈ చదువుతున్న తిలక్, సాయి రేవంత్, రోహిత్ కుమార్, మౌనిక, సాయి కుమార్, అఖిల, అనిల్ కుమార్, బషీర్, బాబు అత్యంత ప్రతిభ చూపారు. పేపర్ ప్రజెంటేషన్‌లో మూడో స్థానాన్ని, పోస్టర్ ప్రదర్శనలో రెండో స్థానం, ప్రోటోటైప్ డెవలప్‌మెంట్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. శనివారం గేట్స్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా తదితరులు అభినందించారు.

ఫ్యాక్షన్ కొనసాగిస్తే తాట తీస్తాం

యల్లనూరు/పెద్దవడుగూరు/గుత్తి: ఫ్యాక్షన్ కొనసాగించినా, చిన్న విషయాలకు ఘర్షణలకు పాల్పడినా తాటతీస్తామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. యల్లనూరు మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో శనివారం వేకువజామున పోలీసులు నాకాబందీ చేశారు. శుక్రవారం సాయంత్రం బెల్టు షాపు ఏర్పాటుపై యోగానందరెడ్డికి పుల్లయ్యకు జరిగిన ఘర్షణ కారణంగా అల్లర్లు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నాకాబందీ చేసినట్లు సీఐ తెలిపారు. గడ్డివాములు, అనుమానిత ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేశారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. పుట్లూరు, యల్లనూరు ఎస్ఐలు హేమాద్రి, శ్రీరామ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని అప్పేచర్లలో ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అదే విధంగా గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

జూనియర్ అసిస్టెంట్‌పై విచారణ

గుంతకల్లు: బకాయి వేతనాల బిల్లులకు డీఎల్‌డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ షేక్షావలి డబ్బు డిమాండ్ చేశారని వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ శనివారం విచారణ చేపట్టారు. 'జీతాల బకాయిల చెల్లింపునకు రూ.60వేలు డిమాండ్' అనే శీర్షికన సాక్షి పత్రికలో గత నెల 26న కథనం ప్రచురితమైంది. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నెలగొండకు చెందిన వీరాంజనేయులు సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం డీఎల్‌పీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి సమక్షంలో విచారణ చేపట్టారు. మీకు జీతాల బిల్లులు పెడుతున్నాను కదా మొత్తం జీతం ఇచ్చినా తక్కువే అని జూనియర్ అసిస్టెంట్ తనతో క్యాజువల్‌గా అన్నారు తప్ప డబ్బు డిమాండ్ చేయలేదని సచివాలయ కార్యదర్శి రమ్య విచారణలో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్‌కు అవగాహన లేనందున తాను సాలరీ బిల్లులు చేసేవాడినని, తానెవరినీ డబ్బు డిమాండ్ చేయలేదని జూనియర్ అసిస్టెంట్ వివరణ ఇచ్చారు. లంచం డిమాండ్ చేసినట్లు పత్రికలో వార్త వచ్చినా చర్యలు తీసుకోలేదనే ఉద్దేశంతో తాను సీఈఓకు ఫిర్యాదు చేసినట్లు వీరాంజనేయులు తెలిపారు. విచారణ నివేదకను తయారు చేసి సీఈఓకు అందజేస్తామని డీఎల్‌డీఓ చెప్పారు.

పశువుల షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పశువుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సంయుక్త సంచాలకుడు వెంకటస్వామి

గార్లదిన్నె: ఉపాధిహామీ పథకం కింద మంజూరైన పశువుల షెడ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డా.వెంకటస్వామి సూచించారు. శనివారం ఆయన గార్లదిన్నెకు చెందిన రైతు రఘురాములుకు మంజూరైన పశువుల షెడ్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ గార్లదిన్నె మండలంలో పశువుల షెడ్ నిర్మాణాలకు 79 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 21 షెడ్లకు అనుమతి వచ్చిందన్నారు. అలాగే 26 షెడ్లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్‌కు పంపారన్నారు. మిగిలిన 32 దరఖాస్తులకు ఎస్టిమేషన్స్ వేశారన్నారు. కార్యక్రమంలో గార్లదిన్నె పశుసంర్ధక శాఖ డాక్టర్ రమేష్, ఏపీఓ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



యాడికిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంఈఓను కోరుతున్న ఎంపీటీసీ

యాడికి: ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కలసికట్టుగా కృషి చేద్దామని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అన్నారు. శనివారం యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీడీఓ వీరాజు హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల పురోగతిపై అధికారులు చర్చించారు. నియోజక వర్గంతో అతి పెద్ద మండలమైన యాడికిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని ఎంపీటీసీ అవుకు నాగరాజు ఎంఈఓ కాశెప్ప దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లా డుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ శశికళ, వయవసాయ అధికారి మహబూబ్ బాషా, వైద్యుడు శ్రీరామ్ కుమార్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



కొండుపల్లి వద్ద బీటీ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీమ్‌బాషా

పెద్దవడుగూరు: ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని డ్వామా పీడీ సలీమ్‌బాషా సూచించారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు, కొండుపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. కొండుపల్లి నుంచి భీమునిపల్లి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. పెద్దవడుగూరు పశువుల షెడ్ల పనులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి కేతిరెడ్డి పరామర్శ



రంగయ్య కుటుంబీకులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: మండలంలోని నీర్జాంపల్లిలో వైస్ ఎంపీపీ-2 రంగయ్య కుటుంబ సభ్యులను తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఇటీవల వైస్ ఎంపీపీ గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శనివారం నీర్జాంపల్లికి చేరుకుని రంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటేష్‌నాయుడు, కల్లూరు సూరి, యల్లనూరు కిరణ్ , నీర్జాంపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మన్న తదితరులున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

యాడికి: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని తాడిపత్రి ఉద్యాన అధికారిణి ఉమాదేవి సూచించారు. శనివారం మండలంలోని కోనుప్పలపాడులో సాగు చేసిన టమాట, ఉల్లి, అరటి తదితర పంటలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీహెచ్ఏ రవి కుమార్, రైతులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు షఫివుల్లా, అజయ్, దీపక్, నాగేంద్రను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వ్యవసాయశాఖ ఏడీ చెంగల్రాయుడు, వీఆర్వో రామాంజనేయులు పాల్గొన్నారు.

రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుంతకల్లు రూరల్: రైల్వే డబుల్ లైన్ ఏర్పాటులో భాగంగా శనివారం గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో ఉన్న మల్లప్ప గేట్ వద్ద ఆర్డీఓ శ్రీనివాస్ స్థల పరిశీలన చేశారు. మల్లప్ప గేట్ ప్రాంతంలో డబుల్ లైన్ ఏర్పాటుకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో రైతుల నుంచి భూమిని సేకరించే క్రమంలో భాగంగా సర్వేయర్ మారెప్పతో కలసి ఆయన స్థలాన్ని పరిశీలించారు.

హెచ్ఎం నిర్లక్ష్యం..

- రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం కోల్పోయిన విద్యార్థిని

అనంతపురం ఎడ్యుకేషన్: పామిడి మండలం ఖాదర్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి నిర్లక్ష్యం కారణంగా పదో తరగతి విద్యార్థిని, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోయిందని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. వివరాలను శనివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.కేశవమూర్తి, కె.శ్రీనివాసులు, సునీత, రాష్ట్ర నాయకులు నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు వెల్లడించారు. విద్యార్థిని కె.కీర్తి ఈనెల 21న అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైంది. జిల్లా జట్టు శనివారం నుంచి మూడు రోజుల పాటు పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. ఇన్‌చార్జ్ హెచ్ఎం అనుమతి ఇవ్వకపోవడంతో పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోయింది. ఈ విషయంపై ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని నాయకులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పొలం కొలతలపై శిక్షణ

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రేడ్-1 వీఆర్‌ఓలకు పొలం కొలతలపై శనివారం శిక్షణ ఇచ్చారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లోని వీఆర్‌ఓలకు శిక్షకుడు దినేష్‌రెడ్డి చైన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంగిలిండ గ్రామంలో వారం రోజులుగా క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. 10 రోజుల పాటు వీఆర్‌ఓలకు శిక్షణ ఉంటుందని శిక్షకుడు తెలిపారు. పొలాల హద్దులు, రైతుల పొలాల సర్వే, కొలతలను ఎలా వేయాలి అనే అంశాలపై వీఆర్‌ఓలకు శిక్షణలో వివరించారు. వీఆర్‌ఓలు భరత్, కిశోర్, బలరాం, హేమలత, కుసుమ, లక్ష్మిదేవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌పై అవగాహన

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న పెంగ్విన్ మాంటిసోరి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు సెల్‌ఫోన్‌పై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌ను తరచూ ఉపయోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలను ఉపాధ్యాయులు వివరించారు. కంటి సమస్యలు, మానసిక సమస్యలు వేధిస్తాయన్నారు. ఇళ్లల్లో పిల్లలకు సెల్‌ఫోన్‌ను దూరంగా ఉంచాలని ...సే టూ నో మొబైల్‌ఫోన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిలాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం

గుత్తి: మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11,12వ వార్డుల్లో శనివారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్ల చేత డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించారు. అంతే కాకుండా చెత్తా చెదారాన్ని దగ్గరుండి తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, కౌన్సిలర్ ఫరూక్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

గుంతకల్లుటౌన్: ఆస్తి, నీటి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. బకాయి ఉన్న పన్నుల వసూలుకు మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది పట్టణంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. శనివారం కమిషనర్ స్వయంగా బకాయిదారులను కలిసి పన్నులను వసూలు చేశారు. ఆర్ఐలు ఎర్రిస్వామి, సికె.రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ అవసరం

బుక్కరాయసముద్రం: కంది పంట సాగులో సస్య రక్షణ పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ సూచించారు. శనివారం శింగనమల మండలంలోని నాయనవారిపల్లిలో కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉందన్నారు. వీటికి గూడు కట్టే పురుగు, మారుక మచ్చల పురుగు ఆశించిందన్నారు. నివారణకు ఇమామెట్ బెంజోయేట్ అనే మందు వాడాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త త్రికళ మాధవి చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముత్యాల రావు, కేవీకే శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాటర్‌ప్లాంట్ ఓపెన్

పామిడి: పట్టణంలోని చాకలివీధిలో ఐదేళ్ల క్రితం అధికారులు సీజ్ చేసిన వాటర్ ప్లాంట్ శనివారం తెరుచుకుంది. 2019లో వాటర్‌ప్లాంట్ ప్రభుత్వ స్థలంలో ఉందంటూ అప్పటి మున్సిపల్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. తిరిగి ఎటువంటి అనుమతులు లేకుండానే ఆ ప్లాంట్ నిర్వాహకుడు, పచ్చ నేత సీజ్ చేసిన తాళాలను పగులగొట్టి ఓపెన్ చేయడంపై కాలనీవాసులు విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై పామిడి పంచాయతీ ఈఓ గోపాల్ స్పందించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాటర్‌ప్లాంట్ తెరవకూడదన్నారు. సిబ్బందిని పంపి వాటర్‌ప్లాంట్‌కు మళ్లీ తాళాలు వేయించామన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి..

పెద్దవడుగూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అలాగే పోలీసు అమరవీరుల గురించి వివరించారు. అనంతరం పోటీల్లో పాల్గొని గెలుపొందిన అనూష, శ్రీధరణి, హేమశ్రీ, అనూష, శిల్ప, విశ్వవీరేంద్రకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కమిషనర్ నయిమ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ డీఏ అరియర్స్‌లో తలెత్తిన సమస్యకు పరిష్కారం చూపి, పర్మినెంట్ కార్మికులకు ఎంత మొత్తం బకాయి ఉందో తెలియజేయాలన్నారు. అలాగే కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తలారి సురేష్, నరసయ్య, చిన్న కొండయ్య, కార్తీక్, ప్రసాద్, చిన్నయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితులు నంద్యాల జిల్లా అవుకు మండలం నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి మహేంద్ర, తలారి శ్రీనివాసులుపై కేసు నమోదు చేశామన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెద్దవడుగూరు: మండలంలో ఎవరైనా అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు, దిమ్మగుడి, ముప్పాలగుత్తి తదితర గ్రామాల్లో అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిని స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని తహసీల్దార్ ఉషారాణి ఎదుట బైండోవర్ చేశారు.

29 నుంచి నిరవధిక సమ్మె

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ సేవ పథకం కాంట్రాక్ట్ ఉద్యోగులు శనివారం ఆ ఆసుపత్రి వైద్యాధికారి జీ శివ కార్తీక్‌రెడ్డికి నిరవధిక సమ్మె నోటీసు అందజేశారు. 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి క్యాడర్, కనీస వేతనాలు అమలు చేయాలంటూ స్థానిక వైద్యమిత్రలు అమర్నాథ్‌రెడ్డి, అనురాధ డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 29 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు వారు తెలిపారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి



బాణసంచా విక్రయదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, ఫైర్ అధికారులు

గుంతకల్లు: బాణసంచా విక్రయించే దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఆర్డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థానిక రైల్వే క్రీడా మైదానాన్ని ఫైర్ ఆఫీసర్ అశ్వర్థతో కలసి ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు బాణసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. సేల్స్ ట్యాక్స్, అగ్నిమాపక, పోలీసుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. బాణసంచాను అధిక ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.